నేడు గ్రీవెన్స్ రద్దు.. పాఠశాలలకు సెలవు

పార్వతీపురం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, అర్జీదారులు ఇంటి వద్దే సురక్షితంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సోమవారం వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తగా బడులకు సెలవు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.


గరుగుబిల్లి: తోటపల్లి స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం


మక్కువ: ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టిగెడ్డ

తుఫాన్ కలవరం

- జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు..
- మరికొన్నిచోట్ల ఓ మోస్తరుగా వర్షం
- అయినా తొలగని భయం
- నేడు, రేపు భారీగా వానలు కురిసే అవకాశం
- వాతావరణ శాఖ ప్రకటనలతో జిల్లావాసుల్లో ఆందోళన
- అప్రమత్తమైన జిల్లా అధికారులు

పార్వతీపురం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై తుఫాన్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ.. ఆదివారం కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్నిచోట్ల ఓ మోస్తరుగా వాన కురిసింది. అరగంట వర్షం కురవడం.. తర్వాత ఆగిపోవడం.. కాసేపటికే ఎండెక్కడం.. మళ్లీ కొద్ది సేపటికే మబ్బులు కమ్మేయడం జరిగింది. జిల్లా అంతటా ఎక్కువ సేపు వర్షం కురవలేదు. ఎగువన ఉన్న ఒడిశా రాష్ట్రం లోనూ పెద్దగా వర్షాలు కురువకపోవడంతో ప్రాజెక్టుల నీటిమట్టాలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. జిల్లా కేంద్రం పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాంతో పాటు మిగిలిన మండలాల్లో చిరుజల్లులు తప్ప పెద్దగా వర్షాలు కురవలేదు. దీంతో రైతులతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఆదివారం రాత్రికి వాతావరణం మారితే.. పంటలకు నష్టం ఏర్పడే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఎఫ్‌ఆర్‌ఎల్‌కు చేరని ప్రాజెక్టుల నీటిమట్టం..

జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నీటిమట్టాలను పరిశీలిస్తే.. తోటపల్లి ప్రాజెక్టు 105 మీటర్లకు గాను 103.70 మీటర్ల మేర నీటి నిల్వ సామర్థ్యం ఉంది. వీఆర్‌ఎస్ 161 మీటర్లకు గాను 159.94, పెద్దగెడ్డ రిజర్వాయర్ 213.80 మీటర్లకు 213.75, వట్టిగెడ్డ రిజర్వాయర్ 121.62 మీటర్లకు గాను 117.56 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి.


గుమ్మలక్ష్మీపురం: వంజరాపుగూడలో కూలిన రేకిల్లు

అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం...

తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. అధికారుల సెలవులను రద్దు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆదివారం పార్వతీపురం, సీతానగరం మండలంలోని పర్యటించి అధికారులకు పలు సూచనలిచ్చారు.

రాకపోకలు నిలపండి...

సీతానగరం: కొత్తవలస డ్యామ్ వద్ద వరద ఉధృతంగా ఉన్నందున గ్రామస్థుల రాకపోకలను నిలుపుదల చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పుట్టూరు కాజ్‌వే, సీతానగరం మండలం కొత్తవలస డ్యామ్ వద్ద వరద నీటి ప్రవాహాన్ని ఆదివారం పరిశీలించారు. 'సువర్ణముఖి నది పరివాహక ప్రాంతమైన కొత్తవలస డ్యామ్ వద్ద రోడ్డుపై ప్రమాదస్థాయిలో నీటి ప్రవాహం ఉంది. కొత్తవలస, బగ్గందొరవలస గ్రామాల ప్రజల రాకపోకలను నిలుపుదల చేయండి' అని ఆయన తహసీల్దార్ జె.రాములమ్మను ఆదేశించారు. డ్యామ్‌కు ఇరువైపులా రెవెన్యూ సిబ్బందిని నియమించి అప్రమత్తం చేయాలని సూచించారు.

చాకిగెడ్డ పరిశీలన..

పార్వతీపురం రూరల్: మండలంలో చాకిగెడ్డను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. చాకిగెడ్డ నిర్వహణ లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలు ముంపునకు గురవుతున్న పరిస్థితిని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఉధృతంగా చిట్టిగెడ్డ..


మక్కువ: మార్కొండపుట్టి సమీపంలో ఉన్న చిట్టిగెడ్డకు వరద పోటెత్తింది. కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో సుమారు పది గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా గోముఖీ రిజ్వాయర్ నుంచి 300 క్యూసెక్కులను నదుల్లోకి విడిచిపెట్టారు.

ఉప్పొంగిన సంతమల్లి గెడ్డ..

సీతంపేట రూరల్: కుసిమి సమీపంలోని సంతమల్లి గెడ్డ ఉప్పొంగింది. రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంకా వర్షాలు కురిస్తే.. గెడ్డపై నుంచి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడనుంది.

నాగావళికి స్వల్ప వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో ఆదివారం పైప్రాంతం నుంచి సుమారు 4,500 క్యూసెక్కుల వరద చేరింది. స్పిల్‌వే గేట్లు నుంచి 2,800 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. వర్షాల ఎడమ ప్రధాన కాలువ నుంచి 250 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.534 టీఎంసీలకు గాను 1.731 టీఎంసీల నీరు నెలకొంది. నదీ తీర గ్రామాలైన తోటపల్లి, సుంకి, సంతోషపురం, తదితర గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లరాదని సూచించారు.


కొత్తవలస వంతెన వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పెద్దగెడ్డ నీరు విడుదల

పాచిపెంట: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దగెడ్డ జలాశయం నీటి మట్టం పెరిగింది. దీంతో ఆదివారం స్పిల్‌వే ద్వారా 250 క్యూసెక్కులను కిందకు విడుదల చేశారు. కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కులను విడిచిపెట్టారు.

విరిగిపడిన కొండ చరియలు..

కురుపాం రూరల్: జి.శివడ పంచాయతీ కోటకొండ గ్రామ సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. రహదారిపై రాళ్లు పడిన సమయంలో వాహనదారులు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు పరిశీలించి రహదారిపై పడిన రాళ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


పాచిపెంట: పెద్దగెడ్డ స్పిల్‌వే నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం


కోటకొండ రహదారిలో విరిగిపడిన కొండ చరియలు

పేరుకే పెద్దాసుపత్రి

- ప్రతీ కేసు రెఫరలే..
- సమయపాలన పాటించని వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఇదీ సీతంపేట ఏరియా ఆసుపత్రి పరిస్థితి
- పెదవి విరుస్తున్న గిరిజనులు

● సీతంపేట మండలంలో ఓ గ్రామానికి చెందిన రంగమ్మ కొద్ది రోజుల కిందట నీరసంగా ఉందని సీతంపేట ఏరియా ఆసుపత్రికి వచ్చింది. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రెఫరల్ చేశారు.

● భామిని మండలానికి చెందిన లక్ష్మణరావు జ్వరంతో, సీతంపేట మండల వాసి వినయ్‌కుమార్ కడుపునొప్పితో ఇటీవల ఆసుపత్రికి వెళ్లారు. అయితే వారిని కూడా 108 వాహనంలో శ్రీకాకుళానికి రెఫరల్ చేశారు.


సీతంపేట ఏరియా ఆసుపత్రి

(సీతంపేట రూరల్, సెప్టెంబరు1)

... ఇలా వారినే కాదు సీతంపేట ఏరియా ఆసుపత్రి నుంచి తరచూ రోగులను రెఫరల్ చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం ఇక్కడకు వస్తున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కొద్దిపాటి నీరసం, కడుపు, గొంతు నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యాధికారులు పరీక్షించి వెంటనే శ్రీకాకుళం రిమ్స్ లేదా రాగోలులోని ఓ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. అయితే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి- సీతంపేట ఆసుపత్రికి వస్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది. కొంతమంది ఈసురోమంటూ వైద్యులు సూచించిన రిమ్స్‌కు వెళ్తుండగా.. మరికొందరు పాలకొండ, కొత్తూరులోని ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. దీంతో గిరిజనులకు సీతంపేట ఏరియా ఆసుపత్రిపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఏరియా ఆసుపత్రిలో ఆధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్య పరీక్షల పేరిట రోగులను రెఫరల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రక్త పరీక్షలను ప్రైవేట్ క్లినిక్‌ల్లో చేయించుకోవాలని వైద్య సిబ్బందే సూచిస్తున్నారు. అంతే కాకుండా కొన్ని రకాల మందులను సైతం బయట తెచ్చుకోవాలని సలహాలు ఇస్తున్నారు. దీంతో రోగులకు చేతి చమురు వదులుతోంది. మొత్తంగా ఏరియా ఆసుపత్రి పేరుకే అన్న విధంగా మారింది.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ ప్రభుత్వం 2019లో సుమారు రూ.20కోట్ల అంచనాతో సీతంపేట సామాజిక ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. అప్పట్లో ఆ నిధులతో అదనపు భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అయితే అదే ఏడాదిలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించింది. ఇప్పటికి 80 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. అదనపు గదులు, బెడ్‌లు అందుబాటులో లేక ఐదేళ్లుగా గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి చొప్పున రోగులు సర్దుకోవాల్సి వస్తోంది. కాగా ఈ ఏడాది ఎపడమిక్ సీజన్ ప్రారంభం నుండే ఏరియా ఆసుపత్రికి రోగులు తాకిడి ఎక్కువైంది. సీతంపేట మన్యంతో పాటు కొత్తూరు, భామిని, హిరమండలం, పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి ఎంతోమంది మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు వస్తున్నారు. దోనుబాయి, కుసిమి, మర్రిపాడు పీహెచ్‌సీల నుంచి టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలతో అధిక సంఖ్యలో గిరిజనులు సీతంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి మెరుగైన వైద్య సేవలందించాల్సిన వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావడం లేదు. మరోవైపు రోగులకు రెఫరల్ చేస్తుండడంపై ఏజెన్సీ వాసులు పెదవి విరుస్తున్నారు. కాగా వంద పడకల ఆసుపత్రిలో 65 బెడ్లే వినియోగంలో ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఓపీ 130 వరకూ ఉండగా.. సోమవారం వారపు సంత జరిగే సమయంలో 300 వరకూ ఓపీ ఉంటుంది. ఎక్కువమంది ఇన్‌పేషెంట్లుగా చేరేందుకు అవకాశం లేకపోవడంతో రెఫరల్‌కు ఇది కూడా ఒక కారణంగా ఉంది. ఏదేమైనా ఏరియా ఆసుపత్రి పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

సమయపాలన లేక..

ఏపీ వైద్యవిధాన పరిషత్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4వరకు తప్పని సరిగా ఆసుపత్రుల్లో ఉండాలి. అంతే కాకుండా ఫేస్ యాప్‌లో తప్పనిసరిగా హాజరు వేయాల్సి ఉంది. అయితే కొంతమంది వైద్యులకు ఇవేమీ పట్టడం లేదనే వ్యాఖ్యలు గట్టిగా వినిపిస్తున్నాయి. నచ్చిన సమయానికి వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సీతంపేట ఏరియా ఆసుపత్రిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శనివారం ఆసుపత్రిని సందర్శించగా.. ఇక్కడి వైద్యులు సమయపాలన పాటించడం లేదని స్పష్టమైంది. ఉదయం 10.40 గంటలకు సూపరింటెండెంట్ గది తెరుచుకోలేదు. వివిధ విభాగాల్లో ఉన్న వైద్యులు కూడా వారి గదుల్లో కనిపించలేదు. ఆ సమయంలో వార్డుల్లో ఇన్‌పేషెంట్ రోగులను చూసేందుకు వెళ్లారా అని పరిశీలిస్తే... వారు అక్కడ కూడా లేరు. ఇంకా వైద్యులు రాలేదని స్వయంగా రోగులు చెప్పారు. వైద్యులు సమయపాలన పాటించక పోయినా ఎవరూ పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దృష్టి సారిస్తాం..

'నేను జూమ్ మీటింగ్‌లో ఉన్నా- అందుకే విధులకు రావడం ఆలస్యమైంది. కాగా ఆసుపత్రిలో వైద్యుల సమయ పాలనపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. బెడ్‌లు చాలని కారణంగా సర్జరీలు అవసరమైన రోగులను మాత్రమే రెఫరల్ చేస్తున్నాం. మిగిలిన కేసులను మాత్రం నాకు తెలియకుండా రిఫర్ చేసే అవకాశం లేదు. ఇటీవల ఆసుపత్రికి ఐపీహెచ్‌ఎల్ ల్యాబ్ మంజూరైంది. దీనివల్ల గిరిజనులకు మెరుగైన రక్త పరీక్షలతో పాటు హెల్త్ రిలేటెడ్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా జరుగుతాయి.' అని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.


శనివారం ఉదయం 10.40 గంటలకు తెరచుకోని సూపరింటెండెంట్ గది

రిఫర్ కేసులు తగ్గించాలి

'సీతంపేట ఏరియా ఆసుపత్రి నుంచి రెఫరల్ కేసులు తగ్గించాలి. అత్యవసర మైతేనే బయటకు పంపాలి. ఈ విషయం నా దృష్టికి వచ్చింది. రెఫరల్ చేయొద్దని ఇప్పటికే వైద్య సిబ్బందికి సూచించా.' అని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయండి

● జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర

సీతంపేట: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆదేశించారు. ఆదివారం వసతిగృహ డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌ఎంలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లోకి విషసర్పాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. జీసీసీ ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసరాల కాల పరిమితిని పరిశీలించి తీసుకోవాలని తెలిపారు. నిబంధనల మేరకు గ్యాస్ వాడకాన్ని అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులను గెడ్డలకు పంపించరాదని, వసతిగృహాల్లోనే స్నానాలు, మరుగుదొడ్లు వినియోగించే విధంగా చూడాలని ఆదేశించారు. వారికి నాణ్యమైన ఆహారం అందించాలని, తప్పకుండా స్టడీ అవర్ నిర్వహించాలని సూచించారు.

మందుల కొరత రానీయొద్దు

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

పాలకొండ: వర్షాల నేపథ్యంలో ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి ఆదేశించారు. ఆదివారం అన్నవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, పాము, కుక్కకాటు ఇంజెక్షన్లు కూడా ఉంచుకోవాలని తెలిపారు.

గిరిజన గర్భిణుల వసతిగృహం పరిశీలన..

సీతంపేట రూరల్: సీతంపేటలో గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, వైద్య పరీక్షలపై ఆరా తీశారు. రోస్టర్ ప్రకారం వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, గర్భిణులపై పూర్తి పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీరు, వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే వారికి ఇవ్వాలన్నారు.

సీతాఫలం అధరహో!



సీతంపేట/గుమ్మలక్ష్మీపురం: మన్యంలో సీతాఫలం పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ఏడాది దిగుబడి తగ్గడం.. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం 25 కేజీలు ఉన్న సీతాఫలాల బుట్ట ధర రూ.1500 నుంచి రూ.2 వేల వరకు పలుకుతుంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో వంద పండ్లను సైజును బట్టి వ్యాపారులు రూ.500కు కొనుగోలు చేసి.. మార్కెట్లో ఒక్కో సీతాఫలాన్ని రూ.30 నుంచి రూ.40కు విక్రయిస్తున్నారు. కాగా ఒక్కసారిగా రేటు పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రానున్న పండగ సీజన్లలో దాని ధర మరింతగా పెరగునున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. అయితే గిరిజన రైతులకు మాత్రం మంచి ఆదాయం వస్తోంది. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. సహజ సిద్ధంగా కొండలపై పండే సీతాఫలం పండ్లకు మంచి డిమాండ్ ఉంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దిగుబడి వచ్చే ఈ పండ్ల కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి కనబరుస్తుంటారు. ప్రస్తుతం రాజమండ్రి, బరంపురం, పర్లాకిమిడి, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వ్యాపారులు జిల్లాకు వచ్చి పోటీపడి మరి సీతాఫలాన్ని కొనుగోలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com





బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరఫున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.

చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తుపెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్లు ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.







2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు

లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్టు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హార్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్విక గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్విక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

గేటు పడితే నిరీక్షణే

- ఎస్‌కోట-పుణ్యగిరి రోడ్డులో రాకపోకలకు అవస్థలు
- ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందుకు రాని రైల్వే శాఖ
- అత్యవసరమైతే పరిస్థితేంటన్న భయంతో స్థానికులు


ఎస్.కోట పుణ్యగిరి గేటు తెరవడంతో అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనదారులు (ఫైల్)

● గతనెల ఆగస్టు 22 వతేదీన గురువారం సాయంత్రం 3గంటల సమయం లో శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని రైల్వే గేటు మధ్యలో గూడ్స్ రైలు అడ్డంగా గంట పాటు ఆగిపోయింది. అటు, ఇటు కదలకుండా ఉండి పోవడంతో ఈ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు గంటపాటు స్థానికులు ఏటువారటే ఉండి పోయారు. కాలినడకన వచ్చిన యువకులు, చిన్నపిల్లలు రైలు కిందకు దూరి పట్టాలను దాటుకుంటూ వెళ్లారు. పుణ్యగిరి వైపు నివాసాలు ఉన్నవారు ఎస్.కోట వైపు, ఎస్.కోటలో నివాసాలు ఉన్న వారు పుణ్యగిరి వైపు రైలు కదిలే వరకు గేటుకు ఇరువైపులా నిరీక్షించారు.

శృంగవరపుకోట

ఈ పరిస్థితి ఈ ఒక్కరోజే అనుకుంటే పొరపాటే. ప్రతి రోజూ ఈ రోడ్డులో ప్రయాణించేవారికి ఇది అనుభవమే. గంటకో, అరగంటకోసారి ఇక్కడ గేటు పడుతుంది. గూడ్స్ రైలు పావు గంటలో వస్తుందనగా గేటు పడుతుంది. గేటు దాటి వెళ్లిన మరో పావుగంటకు గేటు తెరుచుకుంటుంది. ఇలా గేటు పడినప్పుడల్లా కనీసం పావు గంట నుంచి అరగంట వరకు గేటు మూసే ఉంటుంది. తిరిగి గేటు తెరిచేవరకు రెండు వైపులా నిరీక్షించక తప్పడం లేదు.

శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి దేవాలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డులో సబ్ జైలు, తహసీల్దార్ కార్యాలయం, ఖజానా కార్యాలయం, సబ్‌రిజిష్టర్ కార్యాలయం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ప్రధాన బ్రాంచి), ప్రభుత్వ ప్రాంతీయ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, స్త్రీశిశు సంక్షేమ శాఖ, వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం, ప్రభుత్వ గృహనిర్మాణ శాఖ కార్యాలయం, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ, గ్రామీణ తాగునీటి శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు కొంతదూరంలో పుణ్యగిరి రోడ్డు మధ్య నుంచి కొత్తవలస-కిరోండల్(కెకె లైన్) రైల్వే లైను ఉంది. ఈ రైల్వే లైన్ దాటిన తరువాత బర్మాకాలనీ, గిరిజన బాలుర కళాశాల వసతి గృహం, వైఎస్ఆర్ కాలనీ, గిరిజన బాలికల కళాశాల వసతి గృహం, పుణ్యగిరి గ్రామం, రేగ పుణ్య గిరి గ్రామం, ఉమాకోటి లింగేశ్వర స్వామి (పుణ్యగిరి) దేవాలయం ఉన్నాయి. ఇటు నుంచి అటు వచ్చేవారు, అటు నుంచి ఇటొచ్చేవారు రైలు పట్టాలను దాటుకోని రావాలి. ఈ రైల్వేలైన్‌లో అత్యధికంగా సరుకు రవాణా చేసే గూడ్స్ ట్రైన్‌లు రాకపోకలు సాగిస్తాయి. ఐరన్ ఓర్ సరుకుతో వెళ్లే ఈ ట్రైన్‌లు తరచూ రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ఇక్కడి గేటును మూసేస్తున్నారు.


గత నెలలో ఎస్.కోట పుణ్యగిరి గేటులో సుమారు గంట పాటు నిలిచిన గూడ్స్‌రైలు

గిరిజన బాలుర, బాలికల కళాశాలల వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఇటే ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రమే అటు వైపు వుంది. దాదాపుగా 90 శాతం మంది విద్యార్థులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఈ గేటు దాటి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో గేటు పడితే అటు, ఇటు వాహనాలు బారులు తీరుతున్నాయి. బర్మాకాలనీ, వైఎస్ఆర్‌కాలనీ, పుణ్యగిరి, రేగ పుణ్యగిరి గ్రామాల్లో దాదాపుగా 1500 నుంచి 2000 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి అవసరానికి ఈ గేటును దాటుకుంటూ పట్టణంలోకి రావాలి. కళాశాలలకు సమయం అవుతుందన్న తొందరలో ట్రైన్ వచ్చేసమయంలో కూడ కొందరు విద్యార్థులు గేటులో నుంచి వాహనాలను తీసుకువెళ్తున్నారు. రాకపోకలకు ఇన్ని ఇబ్బందులు కలుగుతున్న ఈ రైల్వే గేటు సమస్యను పరిష్కరించేందుకు రైల్వేశాఖ ముందుకు రావడం లేదు. ఈ గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జిను నిర్మించాలన్న ఆలోచన చేయడం లేదు.

రాష్ట్ర విభజన అనంతరం అధికారం చేపట్టిన తెలుగు దేశం ప్రభుత్వంలో అప్పటి, ప్రస్తుత శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకువెళ్లడంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదించారు. అయితే ఈ అండర్ బ్రిడ్జి ఈ గేటు సమీపంలో కాకుండ దాదాపు కిలోమిటరు దూరంలో వున్న కర్నాటక కళ్లాల వద్ద వున్న రైల్వే గేటు వద్ద నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేశారు. పుణ్యగిరి రోడ్డులో వున్న గేటు నుంచి ఎస్.కోట దేవిబొమ్మ కూడలికు 600 నుంచి 700 మీటర్ల లోపు దూరం వుంటుంది. ప్రభుత్వ ఆసుపత్రి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అర కిలోమిటరు దూరం కూడ వుండదు. ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండ రైల్వే శాఖ ఈ గేటుకు దూరంగా కర్నాటక కళ్లాల గేటు వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మిస్తామని చెప్పడంతో స్థానికులు నిరాకరించారు. రైల్వే లైనుకు ఇరు వైపులా రోడ్డు నిర్మాణంనకు సరిపడ స్థలం లేదు. రైల్వే లైనుకు ఆనుకుని నివాసాలు ఉండడంతో ఆటో, కారు వెళ్లేందుకు విలుపడని పరిస్థితి వుంది. ఇలాంటి చోట చేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అభ్యంతరాలు రావడంతో ఈ ప్రతిపాదనకు తెరపడింది. ఇంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లు దీని గురించి పట్టించుకున్న సందర్భాలు లేవు.

భవానీ దీక్షలు ప్రారంభం

రాజాం రూరల్: పట్టణంలోని నవదుర్గ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భవానీ దీక్షలు ప్రారంభమ య్యాయి. సుమారు 2 వేల మందికి పైగా భక్తులు దీక్ష లు చేపట్టారు. వీరికి భవానీ గురుస్వాములు కూరాడ వెంకటరావు, దాసరి అప్పారావు తదితరులు మాల ధారణ చేయించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరిశింగరావు సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ పూజలు చేశారు.

మున్సిపల్ మేనేజర్ బదిలీ

రాజాం రూరల్: రాజాం మున్సిపాలిటీ మేనేజర్ ఎం.వి.నాగరాజుకు బదిలీ అయ్యింది. ఈయనను జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీలో మేనేజర్‌గా నియమిస్తూ మున్సిపల్ పరిపాలనా శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏలేశ్వరం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును రాజాం మున్సిపల్ మేనేజర్‌గా నియమించారు. ఈయన గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు కోరారు. ఆయన ఆదివారం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాల ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. వంట చేసే నిత్యావసర సరుకులు నాణ్యతగా ఉండాలని, పరిశుభ్రమైన రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని, వేడివేడి భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, పీటీజీ పాఠశాల వార్డెన్ వెంకటరావు తదితరులున్నారు. అనంతరం చైర్మన్ శంకరరావు భద్రగిరి ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు.

తుప్పల తొలగింపు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు కోన సత్యనారాయణ సారథ్యంలో గ్రామ పార్టీ కార్యకర్తలు గ్రామానికి చెందిన శ్మశానంలో నాటిన తుప్పలు, డొంకలను తొలగించారు. సత్యనారాయణ తన సొంత ఖర్చుతో మనుషులను పెట్టి మొత్తం శ్మశానంలో తుప్పలను, డొంకలను తొలగించి శుభ్రం చేశారు.

రక్తదాన శిబిరం

కొత్తవలస: కొత్తవలస మండల యువత ఆధ్వర్యంలో ఆదివారం కొత్తవలస జంక్షన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది హాజరై రక్తదానం చేశారు. విశాఖపట్టణానికి చెందిన రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. వారందరికీ సర్టిఫికెట్స్‌ను అందచేశారు. సీఐ ఈ శిబిరానికి హాజరై దాతలను అభినందించారు.

కొత్త బొద్దాంలో ఉచిత వైద్యశిబిరం

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి సారథ్యంలో కొత్త బొద్దాం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 62 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ గ్రామస్థులు నీటిని వేడి చేసి చల్లార్చుకుని తాగాలన్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ మూర్తి, శేకర్‌బాబు, సంతోషి, ఆశాలు పాల్గొన్నారు.

బాలయ్య స్వర్ణోత్సవ సంబరాలు

రాజాం రూరల్: శాసనసభ్యుడు, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో 50 సంవత్సరాలు పూర్తచేసుకోవడంతో స్వర్ణోత్సవ సంబరాలు రాజాంలో ఆదివారం రాత్రి ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఎన్‌బీకే, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఓ సినిమా థియేటర్‌లో కేకు కోసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గత నెలలో మరణించిన బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు మురళీ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు ఆపాలి

బెలగాం: పదోన్నతలు, బదిలీలు చేపట్టకుండా పని సర్దుబాటు చేయడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.మహేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనివార్య పరిస్థితుల వల్ల చేపడుతు న్నామని చెబుతున్న పని సర్దుబాటును మండల స్థాయి లోనే ఆపాలని కోరారు. పాఠశాలల్లో ఖాళీలను విద్య వలంటీర్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఏకీకృత విధానాన్ని ఆమోదించబోమన్నారు.

మట్టి వినాయక ప్రతిమనే పూజించాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రవికుమార్ చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఎం చినగౌరునాయుడు, లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, వివిఎస్ శర్మ, కృష్ణదాసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వి రమణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు, ఆదివారం బొబ్బిలి రాజ దర్బార్ హాల్ లో నియోజక వర్గం ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన), కురుపాం నియోజక వర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పుర ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మీసాల చిన గౌరునాయుడు, వనమిత్ర కృష్ణదాసు, వీఎన్ శర్మ, కె సత్యరాజు, చప్ప అప్పలనాయుడు, చప్ప తిరుపతిరావు, బాల భాస్కరరావు, లక్ష్మణరావు, మల్లీశ్వరరావు తదితురులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: నగరంలోని గురజాడ కళా భారతి ఆడిటోరియంలో స్పార్క్స్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెరువులు, జలజీవజాతుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు వాడాలని కోరారు. సొసైటీ ప్రతినిధి పద్మనాభం, చంద్రిక, హోటల్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, బేబీనాయన

బలవంతంగా చందా వసూలు చేయొద్దు

- రికార్డు డాన్స్‌లు, అశ్లీలనృత్యాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: జిల్లాలో గణేష్ ఉత్సవాల పేరుతో బలవంతంగా చందా వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని స్పష్టంచేశారు. శాంతియుతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఆయా కమిటీల సభ్యులు సహకరించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక చవితి పండగను అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించుకోవడానికి పోలీసు శాఖకు ప్రజలంతా సహకరించాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.నిమజ్జనాల సమయంలో ప్రమాదకరమైన రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు.

జగ్గు చెరువు మదుం నుంచి నీరు పారేలా చర్యలు

శృంగవరపుకోట: శృంగ వరపుకోట జగ్గుచెరువు మదుం(కల్వర్టు) నుంచి వరద నీరు కిందకు పారేలా రెవె న్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు రోజు లుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పుణ్యగిరి కొండల నుంచి వస్తున్న వరద నీటి తో జగ్గు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఈ చెరువంతా గ్రామం పైగభాగంలో ఉంది. గట్టు ఏమాత్రం తెగినా గ్రామాన్ని ముంచెత్తుతోంది. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఈచెరువు మదుం దెబ్బతింది. దీన్ని గుర్తించిన గ్రామ రెవెన్యూ అధికారులు నెలిపూడి రమణ, కన్నయ్య అడివినాయుడు తదితరులు ఆదివారం తహసీల్దార్ అరుణకుమారి దృష్టిలో పెట్టారు. తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడంతో వీరంతా జేసీబీ సాయంతో మదుం నుంచి పుణ్యగిరి గెడ్డలోకి నీరు పారేలా చేశారు. మదుం (కల్వర్టు) కుంగిన స్థానంలో పుణ్యగిరి రోడ్డును కొంత భాగం తవ్వారు. మిగిలిన రోడ్డు భాగం నుంచి స్థానికులు రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం తహసీల్దార్ అరుణ కుమారి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

క్యాన్సర్ ఆసుపత్రికి సాయం అందిస్తాం

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మాణం చేస్తున్న శ్రీవిజయశ్రీ మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రికి తమ వంతు సాయం అందిస్తామని విశాఖపట్టణానికి చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్) సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఆదివారం మంగళపాలెంని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కర్మాగారాన్ని, గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. నూతనంగా ఆసుపత్రి సమీపంలో నిర్మాణం చేస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి భవనాలను పరిశీలన చేశారు. ఈ సేవా కార్యక్రమాలను ఇలానే కొనసాగించాలని, తమ సంస్థ అవసరమైన సహాయ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ సురేష్ బాబు, ఇమంది శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుల కోసం తయారుచేస్తున్న కృత్రిమ అవయవాలను చూపిస్తున్న జగదీష్ బాబు

చంద్రబాబును కలిసిన కళా

రాజాం: మొట్టమొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు ఆదివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు మంచి పాలన దక్షత కలిగిన వ్యక్తి అని, పేదల కోసం, అభివృద్ధి సంక్షేమం కోసం ఎంతో తపించిన గొప్ప నాయకుడన్నారు.


ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న కళావెంకటరావు

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

వేపాడ: శృంగవరపుకోట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని విశాఖ జిల్లా బీజే పీ కార్యవర్గ సభ్యుడు గోకాడ మహేష్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయించాలని, రహదారులు శిదిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి అభివృద్ధికి, నియోజకవర్గంలోని చాలా మంది అర్హులు పింఛన్లు అందక అవస్థలు పడుతున్నారని తదితర సమస్యలతో విజయవాడ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి వినతపత్రం అందజేసినట్లు తెలిపారు.


చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ర్యాలీ

శృంగవరపుకోట: ఉద్యోగ భద్రత కోసం నియోజకవర్గ మద్యం దుకాణాల సిబ్బంది ఆదివారం శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆందోళన చేపట్టారు. గత ఐదేళ్లగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తామంతా బాధ్యతలను సక్రమంగా నిర్వహించామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం విధానాలను మార్చుతున్నామని ప్రకటనలు ఇస్తున్నారని, మా ఉద్యోగ భద్రతకు మాత్రం హామీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మా కుటుంబాల భవిష్యత్ కోసం ఆలోచించాలని కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

మొక్కలు నాటిన ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం వద్దగల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా కర్మాగారంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆర్ఐఎన్ఎల్ సీఎండీ అతుల్ భాట్‌తో కలిసి మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా కర్మాగారం ప్రాంగణంలో, చుట్టూ పర్యావరణానికి పనికివచ్చే మొక్కలను నాటాలని యాజమాన్యానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం, ఇస్తోందని దానిని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కంపెనీ డైరెక్టర్ బి.సురేష్, సీఎండీ రినల్, జగదీష్‌బాబు, కంపెనీ యాజమాన్యం పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కోళ్ల

చెరువులో పడి వృద్ధురాలి మృతి

బొండపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ఎం.కొత్తవలస గ్రామంలో కంది అప్పలనర్సమ్మ(75) నివసిస్తోంది. ఆదివారం తెల్లవారు జామున అప్పలనర్సమ్మ కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపాన ఉన్న చెరువు గట్టుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో మనవడు కడగల శ్రీనివాసరావు గ్రామ పరిసరాల్లో వెతకగా చెరువులో అప్పల నరసమ్మ విగత జీవిగా కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. మనవడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.


అప్పలనర్సమ్మ (ఫైల్)

విద్యార్థికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పులిగూడ గ్రామానికి చెందిన తాడంగి అఖిల్ అనే ఐదో తరగతి విద్యార్థి ఆదివారం సెలవు రోజు కావడంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ ప్రహరీపై నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో తల వెనుక భాగంలో బలమైన గాయాలయ్యాయి. దీనితో అపస్మారక స్థితికి జారుకున్నాడు. వెంటనే గ్రామస్థులు ద్విచక్ర వాహనంపై భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు.

దోపిడీ దొంగల అరెస్టు

గరివిడి: జిల్లాలో సంచలనం రేపిన ఈనెల 21వ తేదీన గరివిడి మండలం అప్పన్నవలస సెంటర్ వద్ద అర్ధరాత్రి జరిగిన దారి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గరివిడి ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి రాజాంకు చెందిన ఇద్దరు బంగారు వ్యాపారస్తులు హుస్సేన్ మల్లిక్, బిల్వర్ హుస్సేన్ అనే ఇద్దరు వ్యాపారస్థులు విజయనగరం నుంచి రాజాంకు బైకుపై వెళ్తుండగా ఐదుగురు నిందితులు వారి ముఖంపై కారం చల్లి ఇనుపరాడ్డులతో కొట్టి, నాటు తుపాకీతో దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. నిందితులలో ముబారక్, అబ్బీర్ హుస్సేన్, సఫీర్ గాజీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. మరో ఇద్దరు నిందితులైన సబ్బీ, రహీమ్‌ల కోసం గాలిస్తున్నామన్నారు. నిందితులందరూ పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు. చీపురుపల్లి సీఐ శంకరరావు, సీపీఎఫ్ సీఐ సత్యనారాయణ, గరివిడి ఎస్ఐ దామోదరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వర్షానికి కూలిన గోడ

వంగర: తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఓనిలో ఆవు సూర్యనారాయణకు చెందిన ఇంటిగోడ కులి పడిపోయింది. అందరూ పనులకు వెళ్లిన సమయంలో గోడ కూలడంతో పెనుప్రమాదం తప్పింది. సూర్యనారాయణ ఇంట్లో ఐదుగురు ఉంటున్నారు. గోడ కూలిన సమయంలో పిల్లలు భయట ఆడుకోవటానికి వెళ్లగా, పెద్దలు పొలంపనులకు వెళ్లటంతో పెనుప్రమాదం తప్పింది.

పాతబొబ్బిలి ప్రధాన రహదారిని సందర్శించిన బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా టీఆర్ థియేటర్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలువ ఉండిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి రాగా ఆదివారం కమిషనర్ రామలక్ష్మి తో కలిసి సందర్శించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు మిడతాన రవి, మర్రాపు సురేష్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని జన సేన నాయకులు మిడతాన రవికుమార్, మర్రాపు సురేష్ అన్నారు. ఆదివారం ఉపము ఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బొండపల్లి మండలంలోని మరువాడ కొత్తవలస ప్రభుత్వ పాఠశాలలో క్లీన్ ఆంధ్రా, గ్రీన్ ఆంధ్రా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ ఆశయసాధనలో జనసైనికులు అంతా భాగస్వామ్యులు కావాలన్నారు. అందరూ బాధ్యతగా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ఇంటి ఆవరణలోనూ, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. మున్నా, శేఖర్, శ్రీను, ఉదయలక్ష్మణతో పాటు, అప్పలరాజు, జనసైనికులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- యూపీఎస్ తాత్కాలిక పరిష్కారమే
- నిరసన తెలిపిన ఉద్యోగసంఘాలు

సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, వాటిని రద్దు చేసి పాత పెన్షన్ విధానమైన ఓపీఎస్‌ని అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేయకూడదని డిమాండ్ చేశారు. -(ఆంధ్రజ్యోతి బృందం)


బొబ్బిలి రూరల్: ఏపీటీఎఫ్ సభ్యుల నిరసన


విజయనగరం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె


రాజాం రూరల్: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు


గుమ్మలక్ష్మీపురం: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

జిల్లా అంతటా అప్రమత్తం

- తుఫాన్ నేపథ్యంలో నదీతీర ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న అధికారులు, పోలీసులు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారింపు
- ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు


వీరఘట్టం: పనస నందివాడలో నదీ తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కళాధర్


భామిని: నదీతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సత్యంనాయుడు


జియ్యమ్మవలస/ కొమరాడ: కళ్లికోట గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ నీలకంఠం


గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులంతా అప్రమత్తమయ్యారు. నదీ తీర ప్రాంతాలు, ముంపు ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఓ.పభాకర్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు పలు గ్రామాల్లోని ప్రజలను ఆదివారం అప్రమత్తం చేశారు. నదీ తీర గ్రామాలైన తోటపల్లి, సుంకి, సంతోషపురం, తదితర గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు ప్రాంతంలో నదిని దాటకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, ఎస్ఐ రమేష్‌నాయుడులు గ్రామాల్లో దండోరా వేయించారు. నాగావళి నది నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని తెలిపారు. అలాగే మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టారు. వర్షాలు, వరద ప్రవాహం తగ్గుముఖం పట్టేంతవరకు పలు గ్రామాల్లో పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించామని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు నీటి ప్రవాహంతో పాటు పరిసర గ్రామాల్లోని పరిస్థితిని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, ఆర్ఐ మండంగి కృష్ణ, వీఆర్వోలు పి.రామకృష్ణ, టి.రవికుమార్, జోజితో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు. ● **జియ్యమ్మవలస/ కొమరాడ:** నదీ పరివాహ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరాడ మండల తహసీల్దార్ రమేష్, ఎస్ఐ నీలకంఠం కోరారు. గత 24 గంటలుగా వర్షాలు కురుస్తుండటంతో నాగావళి నది వరద పెరుగుతున్న నేపథ్యంలో వారు నాగావళి నదీ పరివాహక ప్రాంతమైన కళ్లికోట, దుగ్గి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, నది దాటే సాహసం చేయరాదన్నారు. ప్రజలు సురక్షితంగా ఉండాలన్నారు. ఆ గ్రామాల్లో యువకులు, పెద్దలతో వారు మాట్లాడి తగు సూచనలు అందజేశారు. అత్యవసరమైతే ఖచ్చితంగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సంబంధిత గ్రామ రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉండాలని తహసీల్దార్ రమేష్ ఆదేశించారు. ● **భామిని:** నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీఏ పీడీ వై.సత్యంనాయుడు సిబ్బందిని సూచించారు. వర్షాలు అధికంగా పడుతాయని ప్రభుత్వం ప్రకటించడంతో ఆయన సింగిడి వద్ద వంశధార నదీతీర ప్రాంతాన్ని పరిశీలించారు. హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శేఖరంను సూచించారు. మండలంలో వర్షపాతం అంతంతమాత్రమేనని తహసీల్దార్ తెలియజేశారు. ఒడిశాలో వర్షాల వల్ల నదీ ప్రవాహం పెరగవచ్చునని తెలపడంతో కాట్రగడ, నేరడి, లివిరి, బాలేరు, సొలికిరి, తాలాడ, కీసర, కోసలి నదీతీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

పోలీసు అధికారుల పర్యవేక్షణ

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున తోటపల్లి ప్రాజెక్టు వద్ద రెవెన్యూ అధికారులతో కలిసి పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నాగావళి నది పరివాహక ప్రాంత ప్రజలు నదిలోకి దిగవద్దని కోరారు. పొలాలకు, బయటకు వెళ్లేటప్పుడు మొబైల్ ఫోన్లు పట్టుకొని వెళ్లవద్దని సూచించారు. తుఫాన్‌పై మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు. ● **వీరఘట్టం:** మండలంలోని నాగావళి నదీ పరివాహక గ్రామాలైన కడకెల్ల, కిమ్మి, పనసనందివాడ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కళాధర్ తెలిపారు. ఆదివారం పనసనందివాడ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సూచనలు చేశారు. వర్షాల కారణంగా నదులు ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, పడవలపై ప్రయాణం చేయవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

గుమ్మలక్ష్మీపురం: వంజరపుగూడ గ్రామంలో అధిక వర్షాల కారణంగా వై.నరసింహులు అనే గిరిజనుడి రేకిల్లు కూలిపోయింది. సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం సంభవించింది. అయితే ఆ ఇల్లు శిథిలావస్థలో ఉండడంతో కుటుంబీకులు అప్పటికే ఖాళీ చేసి, వేరే ఇంట్లో ఉంటున్నారు. దీంతో ప్రాణాపాయం తప్పింది.

భామినిలో చిరుజల్లులు..


వర్షం కురుస్తున్న దృశ్యం

భామిని: మండలంలో ఈ ఏడాది వాతావరణం భిన్నంగా తయారయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నా భామిని మండలంలో అంతంత మాత్రంగా వర్షాలు కురవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలోని నులకజోడు, మామిడిచెరువు, ఊర చెరువు, దాసర చెరువుకు ఇప్పటికీ నీరు చేరకపోవడం ఈ ఏడాది రైతులకు ఇబ్బంది తప్పదని భావిస్తున్నారు. పసుకుడి, వడ్డంగి గజపతిసాగరానికి నీరు చేరలేదు. అక్కడక్కడ వర్షపు నీరుతో నాట్లు వేసినా ఫలితం లేదని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు ఆదేశించారు. ఆదివారం ఆయన పెదంకలాం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులో నమోదు చేసిన జ్వర పీడితుల వివరాలపై ఆరా తీశారు. వారి ఆరోగ్య స్థితిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. పాము, తేలు కాటు, తదితర విష పూరిత కీటకాలకు గురైతే అత్యవసర చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లు, మలేరియా, డెంగ్యూ, డయేరియా, తదితర సీజనల్ వ్యాధులకు అవసరమైన నిర్ధారణ పరీక్షలు, మందులను పరిశీలించారు. అలాగే పీహెచ్‌సీలో సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు తలెత్తినా వైద్య సిబ్బంది వెంటనే స్పందించి, అవసరమైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. ప్రసవ సమయం దగ్గరగా ఉన్న గర్భిణులను రిఫరల్ ఆసుపత్రుల్లో చేర్చాలన్నారు. సంబంధిత శాఖల సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని ఎక్కడ ఏ సమస్య తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గరుగుబిల్లి: తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రక్షిత మంచినీటి పథకాల్లో తాగునీరు నిల్వ చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ మండల జేఈ గోపి గౌరీశంకరరావు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించి.. తాగునీరు, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించామని, పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేశామని చెప్పారు. తుఫాన్ కారణంగా ఆయా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా..

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా భారీ వర్షాలతో పాటు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తంగా ఉందని మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బొంతాడ శంకరరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా గాలుల వీచే అవకాశం ఉన్నందున ఏ గ్రామంలోనైనా విద్యుత్ స్తంభాలు విరిగినా, వైర్లు తెగినా తక్షణమే సమాచారం అందించాలని కోరారు. తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచామన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పరిశీలన

పార్వతీపురంటౌన్: తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్, గెడ్డవీధి, బైపాస్ కాలనీతో పాలు పలు లోతట్టు ప్రాంతాల్లో ఆదివారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల లోతట్టు ప్రాంతాల్లోగల వీధులు వరదనీటి ముంపునకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ముంపునకు గురయ్యే కాలనీలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించేలా సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. మరో రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది వారికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.


పార్వతీపురంటౌన్: గణేష్‌నగర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఈనెల పంచదార, కందిపప్పు లేనట్టేనా?

సీతంపేట: తెల్లరేషన్‌కార్డుదారులకు సెప్టెంబరు నెలలో బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని సివిల్ సప్లయి అధికారులు ఆదేశాలు జారీ చేశారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈనెలకు సంబంధించి పంచదార, కందిపప్పు స్టాక్ సంబంధిత సివిల్ సప్లయి గోదాంకు చేరకపోవడంతో ఈనెల కోటా కింద రాగులు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే బియ్యం, రాగులు సంబంధిత స్టాక్ పాయింట్లకు సరఫరా చేశారు. గత మూడు నెలలుగా బియ్యం మినహా కందిపప్పు, పంచదార, గోదుమపిండి వంటివి పంపిణీ చేయకపోవడం, బియ్యం మాత్రమే పంపిణీ చేయడంవల్ల తెల్లరేషన్‌కార్డుదారులు అసంతృప్తి చెందుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సెప్టెంబర్ నెల బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు కూడా ఇస్తారనే ఆశాభావం తెల్లరేషన్ కార్డుల్లో నెలకొంది. ఈ విషయమై సివిల్ సప్లయి గోదాం డిప్యూటీ తహసీల్దార్ రమేష్ వద్ద ప్రస్తావించగా ఇప్పటివరకు పంచదార, కందిపప్పు స్టాక్ రాలేదని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.

రైతు హక్కుల దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న రైతుల సంఘం నాయకులు

పాలకొండ: కొండాపురం గ్రామంలో ఏపీ రైతు హక్కుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘ గ్రామ అధ్యక్షుడు బలగ దుర్గారావు జెండాను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏప్రిల్ 11న అఖిల భారత కిసాన్ సభ ప్రారంభ మహాసభ జరపగా, సెప్టెంబరు 1న ఆనాటి బ్రిటిష్ వారి ప్రభుత్వ విధానాలకు, రైతు హక్కుల కోసం పెద్ద ఎత్తున నినాదాలు చేశారని చెప్పారు. జమిందారీ విధానం రద్దు చేయాలని, అధిక పన్నులను నిలిపివేయాలని తదితర డిమాండ్స్‌ను రూపొందించుకొని డిమాండ్స్‌డేగా పిలుపునిచ్చారని తెలిపారు. రైతు ఉద్యమాలు సందర్భంగా చనిపోయినవారి కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీనిచ్చి నేటికీ అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తి, రాయ రామకృష్ణ, కిమిడి త్రిపురాంతకరావు, బలగ ఆనందరావు, పారినాయుడు, గోవిందరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం వద్దు.. శాంతి కావాలి



సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన చేస్తున్న దృశ్యం

పాలకొండ: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మరణకాండను ఆపాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ప్రపంచకార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పాలకొండలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సా మ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల ఇప్పటికి 40 వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారని, ఇందులో మహిళలు, చిన్నపిల్లలే 20వేల మందికి పైగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ కార్మికవర్గం ఈ సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించాలని, ప్రపంచ శాంతికి నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పాలకొండ మండల కార్యదర్శి కాద రాము, చింతల శ్రీదేవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ సురేష్, సీహెచ్.సంజీవి, పి.వేణు, సంఘ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దత్తివలసలో దేశమ్మ వారోత్సవాలు


దేశమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

సాలూరు రూరల్: దత్తివలసలో దేశమ్మ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ ఘటాలతో గ్రామపొలిమేర వరకు శోభాయాత్రగా వెళ్లారు. గ్రామ పొలిమేర వద్ద అమ్మవారి చెట్టుకు పూజలు చేశారు. పూజలు అనంతరం తమ మొక్కులు చెల్లించుకున్నారు.

గుమ్మిడిగెడ్డ నీరు విడుదల


గుమ్మిడిగెడ్డ సాగునీరు విడుల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ నేత వీరేశ్

కురుపాం: గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జగదీశ్వరి రైతులకు హామీ ఇచ్చారు. మండలంలోగల కురుపాం పంచాయతీ సీతంపేట గ్రామం వద్ద గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువ నుంచి ఆదివారం ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ నీరు విడుదల చేశారు. ఈ రిజర్వాయర్ ద్వారా కురుపాం, జియ్యమ్మవలస మండలాల రైతులు పొలాలకు సాగునీరు అందుతుంది. గత ఐదేళ్లగా గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువకు పూడిక తీయకపోవడంతో రైతుల పొలాలకు సక్రమంగా నీరు అందలేదు. దీంతో ఇటీవల ఆయకట్టు రైతులు అందరూ స్వచ్ఛందంగా పూడిక తీసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, కోలా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ విలువలపై అవగాహన కల్పించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భంజ్‌దేవ్, శరత్‌బాబు

సాలూరు రూరల్: చిన్ననాటి నుంచే పిల్లలకు సాహితీ విలువల పట్ల అవగాహన కల్పించాలని ప్రముఖ సాహితీవేత్త జంధ్యాల శరత్‌బాబు సూచించారు. ఆదివారం సాలూరులో 89వ సాహితీ కార్యక్రమం నిర్వహించారు. సాలూరు సాహితీమిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షుడు జేబీ తిరుమలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శరత్‌బాబు పాల్గొని మాట్లాడారు. సమాజానికి సాహిత్యం అవసరం ఎంతో ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతు సాహిత్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈసందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన దృశ్యభాష పుస్తకాన్ని ఆవిష్కరించారు. అష్టమ స్మారక సాహితీ పురస్కారాన్ని ఎస్.కోటకు చెందిన పత్రాయుడు కాశీవిశ్వనాథం, గుమ్మా నాగమంజరిలకు అందించారు. సాహితీమిత్ర నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థుల థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బొర్రా రామారావు, ఇండుపూరి నారాయణరావు, షావుకారి చంద్రశేఖర్, ఆకుల గణపతి, శేషు, గొట్టాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి


తోటపల్లిలో పూజలు నిర్వహిస్తున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో తీసుకువెళ్లే సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే ఉందని టీడీపీ మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఆదివారం తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తోటపల్లి ఎంపీటీసీ సభ్యుడు మరడాన సింహాచలంనాయుడు, గిజబ మాజీ సర్పంచ్ ఎం.కృష్ణమూర్తి నాయుడు, మార్కొండ పకీరునాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

సీతానగరం: చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి కె.గౌతమిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొత్తవలస డ్యామ్ సమీపంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడం, నిర్వహణ లోపానికి గల కారణాలపై ప్రశ్నించి అసహనాన్ని వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 15నుంచి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిందేనని అన్నారు. ఆర్డీవో కె.హేమలత, తహసీల్దార్ రాములమ్మ, ఆర్ఐ ఎన్.శ్రీనుబాబు, కొత్తవలస, బగ్గందొరవలస వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సాలూరు రూరల్: పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాల చెందిన 2003 పదో తరగతి బ్యాచ్ ఆదివారం సాలూరు మండలం గోముఖీ రిజర్వాయర్ వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమలో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇవ్వాలని నిర్ణయించారు.

గోతులు పూడ్చిన పోలీసులు


దేవుబుచ్చింపేట వద్ద గోతులను పూడ్చివేయిస్తున్న పోలీసు

సాలూరు రూరల్: దేవుబుచ్చింపేట వద్ద రోడ్డుపై ఉన్న భారీ గోతులను సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం పూడ్చారు. ఈ రోడ్డులో భారీగా గోతులు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎస్ఐ స్పందించి.. చిప్స్ రాయి తెప్పించి వేయించారు. రాళ్ల, మట్టితో పూడ్చారు. ● అలాగే సాలూరు రూరల్ పోలీసుస్టేషన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులను ఆదివారం స్థానిక పోలీసులు శ్రమదానంతో పూడ్చారు. ఈ శ్రమదానంలో ఏఎస్ఐ బంగారయ్య, హెచ్‌సీ వి.బంగారురాజ్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెలగాం: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎన్జీహోంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన నాయకుడు చందక అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే విజయ చంద్ర ప్రారంభించారు. పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చేసే కార్యక్రమాలు పదిమందికి ఉపయోగడపడేలా ఉండాలని ఉద్దేశంతో మొదటి రోజు మొక్కలు నాటామని, రెండో రోజు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని అనిల్ తెలిపారు. అలాగే పాతబస్టాండ్ వద్ద జనసేన నాయకుడు రాజాన రాంబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


రావుపల్లిలో మొక్కలు నాటుతున్న పురుషోత్తంనాయుడు, తదితరులు

గరుగుబిల్లి: పర్యావరణం పరిరక్షణకు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు అన్నారు. ఆదివారం రావుపల్లిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని 101 మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోను శివ, సత్యనారాయణ, సీహెచ్ రామకృష్ణ, కె.తిరుపతిరావు, జి.అను, ఆజీ సర్పంచ్ దాసరి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సాలూరు రూరల్: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఇఫ్కో) రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దత్తివలసలో ఇఫ్కో ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలన్నారు. మహిళలు వివిధ వస్తు ఉత్పత్తి చేయడానికి తమ సంస్థ శిక్షణ, ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 56 వేల మహిళా బృందాలకు తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలినాయుడు, విజయకుమార్, దినేష్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

బెలగాం: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రెసిడెంట్‌గా మంతిన వాసుదేవరావు, కార్యదర్శిగా పత్తిక చంద్రమోహన్, కోశాధికారిగా గొడ్డు చక్రవర్తి, గౌరవాధ్యక్షుడిగా మజ్జి రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా శ్రీకాకుళం జిల్లా నుంచి ఎంపీ రమణ, ఎస్.సాంబయ్య, విజయనగరం జిల్లా నుంచి ఎన్.వెంకటనాయుడు వ్యవహరించారు.